# సారాంశం

రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన అత్యంత ఆశావహమైన కార్యక్రమం 'జలయజ్ఞం'. 97 లక్షల ఎకరాలకు పైగా ఆయకట్టుకు సాగునీరు, రెండు కోట్లకు పైగా జనాభాకు తాగునీటి ప్రయోజనాన్ని అందించే ఉద్దేశ్యంతో పెను ఆర్థిక భారంతో చేపట్టిన ఈ కార్యక్రమం ఆశించిన సామాజిక - ఆర్థిక ప్రయోజనాల దృష్ట్యా , రాష్ట్రంలోని అత్యంత వెనుకబడిన ప్రాంతాల్లో నిర్జలమైన మెట్ట ప్రాంతాల్లో సాగునీటికి, తాగునీటికి ప్రభుత్వం ఇచ్చిన ప్రాధాన్యం దృష్ట్యా ప్రశంసించదగినదే. ఐతే, ప్రణాళికా రచన లోపభూయిష్టంగా ఉన్న కారణంగానూ, ప్రాజెక్టులకు అవసరమైన భూముల సేకరణ, కేంద్ర జల సంఘం/పర్యావరణ - అటవీ మంత్రిత్వ శాఖ/గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ/ప్రణాళికా సంఘాల అనుమతులు పొందడం, పునరావాస - పునర్నిర్మాణ కార్యకలాపాలు మొదలైన అంశాల్లో జాప్యాలతో ప్రాజెక్టుల నిర్మాణానికి కలిగిన ఆటంకాల మూలంగానూ ఈ కార్యక్రమం అమలు మందగించింది.

ప్రాజెక్టులకు అవసరమైన మేర జలాలు (కృష్ణా, పెన్నా నదులపై చేపట్టిన ప్రాజెక్టుల విషయంలో), తగినంత విద్యుత్తు (ఎత్తిపోతల పథకాల విషయంలో) లభ్యత లాంటి ప్రాథమిక అంశాల విషయంలో సాధ్యాసాధ్యాల అధ్యయనం చేయకుండా, కొన్ని ప్రాజెక్టుల్లో ఆయకట్టును సరిగ్గా నిర్ధారించకుండానే ప్రాజెక్టులను చేపట్టారు. తగిన స్థాయిలో జల వనరుల లభ్యతను ధృవీకరించుకోవాలంటూ కేంద్ర జల సంఘం వ్యక్తం చేసిన ఆందోళనలను కూడా నిర్లక్ష్యం చేయడం జరిగింది.

రాష్ట్ర ప్రభుత్వం అవలంబించిన ఈపీసీ కాంట్రాక్టు విధానం సముచితమైన రీతిలో రాష్ట్రానికి ప్రయోజనాలను అందించ లేదు. టెండర్లలో సరైన పోటీకి వీలు కల్పించేందుకు అవసరమైన సమయాన్ని ఇవ్వలేదు. పలు కాంట్రాక్టులను సింగిల్ టెండరు ప్రాతిపదికన అప్పగించారు. అనేక సందర్భాల్లో టెండర్లు అందిన/తెరచిన తర్వాతనే అంచనాలకు సాంకేతిక మంజూరీలను పొందారు. ఐబీఎమ్‌లను ఖరారు చేయడంలో జాప్యాలుండడమే కాకుండా టెండర్లు వచ్చిన/తెరచిన తరువాత కూడా ఐబీఎమ్ అంచనాలలో మార్పులు చేసిన సందర్భాలున్నాయి. పూర్తి స్థాయి సర్వే, ఇన్వెస్టిగేషన్, డిజైన్ల తయారీ, పనుల నిర్వహణ అన్నింటికీ కలిపి స్థిరమైన ఒప్పందపు విలువ ఉండే ఈ కాంట్రాక్టు విధానంలో, పనుల స్పెసిఫికేషన్లలో వచ్చే మార్పుల విషయంలో వ్యవహరించేందుకు తగిన నిబంధనలు ఒప్పందాల్లో లేకపోవడంతో పలు సందర్భాల్లో ప్రాజెక్టు పరిధి, పనుల పరిమాణం మొదలైనవి తగ్గినపుడు గుత్తేదార్లు లబ్ధి పొందారు.

కొన్ని ప్రాజెక్టుల విషయంలో సాధ్యాసాధ్యాలను రూఢీ చేసుకోకుండానూ, పలు ప్రాజెక్టుల విషయంలో ప్రాజెక్టు సమగ్ర నివేదికలు, అవసరమైన అనుమతులు లేకుండానూ టెండర్లు పిలిచి 74 ప్రాజెక్టులను ఏకకాలంలో చేపట్టే బదులు, ప్రభుత్వం ప్రాజెక్టుల ప్రాథమ్యాలను మధ్యకాలికం నుంచి దీర్ఘకాలిక ప్రాతిపదికన నిర్ణయించి, ఆ మీదట ఒక్కో సమయంలో కొన్ని ప్రాజెక్టులపై మాత్రమే దృష్టి పెట్టి తగినన్ని వనరులను కేటాయించడం, అవసరమైన


*భూములను సేకరించడం ద్వారా వాటిని సకాలంలో పూర్తిచేసి రైతులు, ప్రజలు ఆశిస్తున్న ఫలాలు వారికి సత్వరమే అందేలా చూసి ఉండాల్సింది. కానీ, ఇప్పుడు ప్రభుత్వం ఒకేసారి భారీ సంఖ్యలో ప్రాజెక్టులను చేపట్టింది. ఈ ప్రాజెక్టులు పుర్తవడానికి చాలాకాలం పడుతుంది. అంతేకాక, తగినంత నీరు, విద్యుత్తు లేనందున అనేక ప్రాజెక్టుల మనుగడే ప్రశ్నార్ధకమౌతోంది. అసంపూర్తిగా ఉన్న ఈ ప్రాజెక్టుల (తత్సంబంధిత కాంట్రాక్టుల) ఆర్థిక భారం భవిష్యత్తులో సుదీర్ఘ కాలంపాటు రాష్ట్ర ఖజానాకు సవాలుగా మారనుంది.*



(వాణీ శ్రీరామ్)
ప్రధాన మహాగణకాధికారి (జీ&ఎస్ఎస్ఏ)
ఆంధ్రప్రదేశ్

హైదరాబాదు

ధృవీకరించడమైనది



(వినోద్ రాయ్)
భారత కంప్ట్రోలర్ మరియు ఆడిటర్ జనరల్

కొత్త ఢిల్లీ